# ముగింపు

రచన:
శ్రీ కె. రవికుమార్

'ఈ మధ్య ఓ కొత్త ఫేషను మొదలయింది తెల్సా?' అన్నాడు కరుణాకర్ సిగరెట్ పొగ వూదేస్తూ.

'ఏమిటది?' అనాలోచితంగా ఎటో చూస్తూ అడిగాడు ప్రభాకరం.

'ఏముందీ! మేనమామ, మేనత్త కూతుళ్ళను కొత్త అమ్మాయిలను ప్రేమించినట్లు ప్రేమించి పెళ్ళి చేసుకుంటున్నారు.'

ప్రభాకరం వులిక్కిపడ్డాడు. కాస్త సీరియస్‌గ కరుణాకర్ కేసి చూశాడు.

కరుణాకర్ ఓసారి చిన్నగా నవ్వాడు. 'నీ సంగతి కాదురా బాబూ! జనరల్‌గా చెపుతున్నాను. అంత మాత్రానికే కోపమయితే ఎలాగోయ్! చూడు, మన రత్నారెడ్డి...'

'అవునవును. వాడేం చేస్తున్నాడిపుడు?' మధ్యలో అందుకొని ఆతృతగా అడిగాడు ప్రభాకరం.

'లెక్చరర్‌గా వుంటున్నాడులే నెల్లూర్లో! కాని అసలు విషయం చెప్పనివ్వూ మరి! వాడేం చేశాడో తెల్సా? వాళ్ళ మామయ్య కూతుర్ని ప్రేమించి పెళ్ళాడేశాట్ట!'

'వెరీగుడ్! మంచిపని చేశాడు.'

'అందులోనూ వాళ్ళ మామయ్యతో హోరాహోరీ యుద్ధం చేసి, అప్పటికీ ఆయనొప్పుకోకపోతే వన్ ఫైన్ మార్నింగ్ ఎవరికీ చెప్పకుండా రిజిష్టర్ మేరేజ్ చేసేసుకున్నాట్ట!'

'మరి ఆయన ఎందుకు వప్పుకోనట్లు?'

'మనవాడికంటె ఆ అమ్మాయి రెండేళ్ళు పెదదట!'

ప్రభాకరం చిన్నపోయాడు. కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు.

'మన దాసు గుర్తున్నాడా? యస్సెల్సీలో మన క్లాస్ లీడర్. తెలుగు మాష్టారు వాణ్ణి 'రామదాసూ' అని పిల్చేవారు!' మళ్ళీ కరుణాకరే అందుకున్నాడు.

ఓ క్షణమాలోచించి 'ఓ...యాసెస్. గుర్తొచ్చాడు. వాడి [illegible]ంది?' అడిగాడు ప్రభాకరం.

M/S
P. B. No

'వాడికేమీ కాలేదు. నిక్షేపంలా వున్నాడు. పోయినేడు మద్రాసులో డిప్లమా ఒకటి సంపాదించి వైజాగ్‌లో రేడియో షాపొకటి పెట్టుకున్నాడులే! ఈ మధ్య వాడుకూడా యిలాగే వాళ్ళత్తయ్యకూతుర్ని అమాంతం ఎత్తుకువచ్చి పెళ్ళి చేసుకున్నాడు.'

'ఐతే ఆ పిల్లకూడా మనోడికంటే...'

'కాస్తోకూస్తో పెద్దదే! అదీగాక బి. యెస్సీకూడ ప్యాసయింది. మనోడిసంగతి తెలుసుగా. యస్సెల్సీ ప్లస్ ఓ పనికిరాని డిప్లమా.'

'మిష్టర్ కరుణాకర్, నువ్ పొరపాటు పడుతున్నావ్... ప్రేమకు చదువూ సంధ్యా వయసులతో నిమిత్తం లేదు. నాకు తెలిసిన ఓ కేస్ చెప్తాను విను. అబ్బాయి పి. యు. సి అమ్మాయి మెడిసిన్ ఫోర్త్‌ఇయర్ చదువుతూంది. ఇక, వయసు సంగతికి వస్తే షేక్‌స్పియర్, జాన్‌సన్ లాంటి మహానుభావు లనిపించుకొన్న వాళ్ళెందరు తమకంటె పెద్దవాళ్ళను చేస్కోలేదు. నేనే ఓ యం. పి. నైతే అబ్బాయిలు తమ కంటె పెద్ద అమ్మాయిలనే చేస్కోలని బిల్లొకటి పాస్ చేయించేద్దును.'

'ఏడికావు లేవోయ్ తెలివి! ఇతే నువ్వో యాభైఏళ్ల ముసలమ్మని చేసుకుంటావా?' విరగబడి నవ్వాడు కరుణాకర్.

'అదికాదోయ్! నా భాషలో 'పెద్ద' అనే పదానికి లిమిటేషన్ కూడా వుంది. ఐదేళ్ళూ, ఆ లోపూ అంతే. కాస్త రోషంగా సమర్థించాడు ప్రభాకరం.

'సరే యీ గొడవ యివాల్టికి ఆపేద్దాం. మరి యిలా వదిలేస్తే బండి పట్టాలు తప్పే ప్రమాదముంది. అసలు నే వచ్చిన సంగతేం చేశావ్? త్వరగా లే! ఏదన్నా పిక్చర్‌కి పోదాం' అంటూ లేచి సిగరెట్ పీక కాలికింద నలిపేశాడు కరుణాకర్.

'నేను రానివ్వాళ.' గట్టిగా చెప్పేశాడు.

'సరే. నేనన్నా పోతా' నంటూ వెళ్ళిపోయాడు కరుణాకర్.

ప్రభాకరం ఏకాంతంగా కిటికీదగ్గర కూచ్చున్నాడు. అతని ఒంటరితనానికి జాలిపడి మధ్యమధ్య చల్లగాలులు

పలుకరిస్తున్నాయి. అందులో ఓ చక్కటి గాలితెర హృదయం మీదుగా వీచి 'ప్రేమ' ను ముందుకు తెచ్చింది.

'ప్రేమ' అంటే 'ప్రేమలత'. ప్రభాకరానికి స్వయాన మేనమామ కూతురు. చూడగానే ఎవరయినా చక్కటి పిల్లే అనేస్తారు. బి.యెస్సీ ఫస్టు క్లాసులో పాసయింది. ప్రస్తుతం వుమెన్స్ కాలేజీలో బోటనీ డిమాన్‌స్ట్రేటరుగా పనిచేస్తూంది.

ఇరవై రెండేళ్ళ ప్రభాకరం జీవితంలో 'ప్రేమ' తాలూకు ప్రేమకథ యీ మధ్యనే ప్రారంభమైంది. మరి మొదటినుంచి ఎందుకు లేదూ అన్న ప్రశ్నకు బోలెడు సమాధానాలున్నాయి అతనిదగ్గర.

ముఖ్యంగా చెప్పాలంటే, ప్రభాకరంకంటే ప్రేమ సరిగ్గా ఏణ్నర్థం పెద్దది. రెండోది, చిన్నప్పటినుంచీ ప్రేమతో ఏవిధమైన చనువూ లేదు. ఎప్పుడైనా వాళ్లింటికి వెళ్తే అసలు కనబడేదికూడా కాదు.

ఇంతవరకూ ఎన్నడూ ప్రేమ పెళ్ళి ప్రస్తావనరాలేదు వాళ్ళింట్లో. ఇదీ ఒకందుకు మంచిదే అనుకుంటాడు తాను. కాని అసలు కారణం తనకు బాగా తెలుసు. మామయ్యకు మతిస్థిమితం లేకపోవటమే. ఆయనకున్న ఒక్కగానొక్క కొడుకు ప్రసాదం ఆ మధ్య రైలు ప్రమాదంలో శాశ్వతంగా దూరమయ్యాడు. అప్పటినుంచి మామయ్య అదోరకం మనిషైపోయాడు. ఏమీ పట్టించుకోడు. చీటికి మాటికి అందర్నీ కేకలేస్తుంటాడు. అందుకే మామయ్య అంటే తనకు చెప్పలేనంత సింపతీ !

కాని యిప్పుడు మామయ్య గురించి ఆలోచించేందుకు తనకు తీరికలేదు. ఏ కాస్త సమయం దొరికినా ఆలోచించేది ప్రేమ గురించే.

ఇటీవల ఓ సంఘటన జరిగింది. మామయ్యకు యేదో ఆపరేషన్ చేస్తున్నారంటే, పది రోజులు శెలవుమీద వెళ్ళాడు ప్రభాకరం. ఆపరేషన్ తేలిగ్గానే జరిగిపోయింది. ఆ పదిరోజులూ అంతకంటె తేలిగ్గా జరిగిపోయాయి. ప్రభాకరం తిరిగి వచ్చేశాడు. ఇది జరిగి సరిగ్గా మూణ్ణెల్లు.

ఈ మూణ్ణెల్లనుంచీ ప్రభాకరం కొత్త ధోరణిలో వుంటున్నాడు. మునుపటిలా అందరితో ఎక్కువగా మాట్లాడటం లేదు. ఎప్పుడూ పనిగట్టుకుని ఒక్కడే కూర్చుని ఏదో ఆలోచిస్తుంటాడు.

మామయ్య దగ్గర తానున్న పదిరోజుల్లోనూ బోలెడు సంగతులు జరిగాయి. వాటన్నిటినీ పేని ఒకటిగా చెప్పాలంటే—తొలిసారిగా ప్రేమతో పరిచయమైంది. ఆ పరిచయం యింతయి అంతయి, ఇప్పుడు హృదయమంతా నిండిపోయింది. దాన్నే 'ప్రేమ' అంటాడు తాను. అందుకనే ఈ మధ్య ప్రతి ఆదివారం గుంటూరు వెళ్తున్నాడు మామయ్యగారింటికి.

'ఏమి చూసి ప్రేమించావూ?' అని కరుణాకర్ మొదటిసారిగా అడిగినపుడు, తనకున్న బియ్యే సైకాలజీ విజ్ఞానంతో 'ఆమె అందమైన మనసు' అన్నాడు పెద్ద శాస్త్రవేత్తలా. అవటమే కాదు, ఎప్పుడూ అలాగే అనుకొంటాడు కూడా.

అయితే ఇలా ఎన్నాళ్లని తనలోనే అనుకొంటూ కూచోవటమన్నది ఓ పెద్ద సమస్యగా తయారైంది. ఎలాగయినా యీ విషయం ప్రేమకు చెప్పాలి, అవును—చెప్పితీరాలి.

వెంటనే పైకిలేచాడు ప్రభాకరం. కాగితం, కలం అందుకున్నాడు. మాంచి మూడ్‌లో వున్నాడేమో—చకచకా ఓ ఆరుపేజీల ఉత్తరం రాసిపారేశాడు. మళ్ళీ మళ్ళీ చదివి జాగ్రత్తగా ఎడిట్ చేసుకొని చక్కగా ఫెయిర్ చేశాడు. దాన్ని ఓ కవర్లో మడిచి పెట్టి కవర్ అంటించాడు.

ఇంత మాంచి వుత్తరాన్ని ఎలా అందివ్వాలీ అన్న ఆలోచన రానే వచ్చింది. నిజమే—రాయటమైతే రాశాడు, కాని అది గమ్యం చేరేట్లు చూడొద్దూ మరి! ఓ రెండు నిముషాలు సీరియస్‌గా ఆలోచించాడు.

మూడోనిముషంలో దొరికింది ఓ అయిడియా. తక్షణం రాసేశాడు కాలేజీ అడ్రస్. ఎవరన్నా కాజేస్తారేమో అన్న అనుమానం వచ్చింది. మరేం ఫర్వాలేదు, అంటూ అంతరాత్మ అభయమిచ్చింది.

× × ×

[illegible] రోజు ఆఫీస్‌కి రాగానే లెటర్‌బాక్స్ వేపు పరుగెత్తాడు ప్రభాకరం. హడావుడిగా అంతా గాలించాడు తన పేర్న ఓ కవర్ కన్పించింది. ఆ [illegible] ద [illegible]న్నాడు. తప్పకుండా ప్రేమే ర[illegible]



SELEKT

CENTRIFUGAL PUMPS

LONG STANDING

* EFFICIENT

* ECONOMIC

* GUARANTEED



*Manufacturers:-*

Phone: 24548

CHITRA INDUSTRIES

8/160 A. TRICHY ROAD

SINGANALLUR :: COIMBATORE-5.


దడదడలాడాయి, బోలెడంత సంతోషంతోనూ రవ్వంత గాభరాతోనూ.

కాంటీన్‌కి దారితీశాడు. ఆ సమయంలో ఎవరూ వుండరక్కడ. ఉత్తరం విప్పాడు. వణుకుతున్న చేతుల్తో, తడబడుతున్న మనసుతో చదివాడు. చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. మళ్లీ చదివాడు. మడిచి జేబులో పెట్టేశాడు. ఇక ఆలోచించటం మొదలుపెట్టాడు.

ఆ వుత్తరం తాననుకున్నట్లు ప్రేమే రాసింది. కాని, తానూహించిన సమాధానం అందులో లేదు. కొండంత ఆశతో కోరికలన్నీ కూర్చిపంపాడు మాలగా. కాని, వాటన్నిటినీ తృటిలో తెంపి పారేసింది.

...యపడివి. ఇలాంటి పిచ్చి ఊహలు మరె... అన్న సారాంశంతో తనను మెత్త-

M/S
P. B. No

గా మందలిస్తూ ఇంగ్లీషులో వ్రాసింది.

పదేపదే ఆ వుత్తరంలోని వాక్యాలు మనసులో కదులుతూ కళ్లముందు కన్పిస్తున్నాయి.

ప్రభాకరాన్ని ఎవరో దూరంగా అగాధంలోనికి విసిరి పారేసినట్లయింది. కొంతవరకు ఆత్మాభిమానం కూడా దెబ్బతిన్నది. నిరాశా, నిస్పృహా ఒకటిగా చేరి హృదయాన్ని కదిలించివేశాయి.

తలవంచుకొని కళ్లద్దుకున్నాడు. 'ఛ...ఛ...ఏమిటిలా ఆడదానిలా అయిపోవటం! ఇప్పుడు అధైర్యపడి లాభం లేదు. ధైర్యంగా సాధించాలి...' తనను తానే సంబాళించుకున్నాడు.

× × ×

'ఎవరో వచ్చారు మీకోసం' అన్నాడు ఆ బెండర్ అబద్ధయ్య.

'నాకోసమా !' అంటూ లేబరేటరీనుండి ఆత్రుతగ వరండావేపు నడిచింది ప్రేమ. అక్కడకు రాగానే కన్పించాడు ప్రభాకరం. కాస్తబెరుగ్గా దగ్గరకు వచ్చి 'ఏమిటిలా వచ్చావు?' అడిగింది ప్రేమ.

'ఏం రాకూడదా? పోనీ—యిక ముందు రాన్లే!' అదోలా అన్నాడు.

ప్రేమ ఏమీ అనలేదు.

ఓ క్షణమాగి—'నీతో అర్జంటుగా మాట్లాడాలి ఓ నిముషం. సాధ్యపడుతుందా?' అని అడిగాడు ప్రభాకరం.

ఓసారి వాచీ కేసి చూసుకొని 'ఇక్కడే వుండు. కబురు చేస్తాను' అంటూ వెళ్ళిపోయింది ప్రేమ.

కొద్దిసేపటిలో ప్రభాకరాన్ని బోటనీలాబ్‌లోకి తీసుకెళ్ళాడు ఆటెండర్ అబ్దయ్య.

ప్రేమ ఒక్కతే కూర్చొని తనకోసమే ఎదురు చూస్తూంది. 'రా...కూర్చో...' అంటూ తన కెదురుగా కుర్చీ చూపింది. కుర్చీ కాస్త ముందుకులాక్కొని కూర్చున్నాడు ప్రభాకరం.

'ఏమిటీ, చెప్పు?' అడిగింది,

'ఫర్వాలేదా?' చుట్టూ చూస్తూ అడిగాడు.

'ఏం ఫర్వాలేదు. మరో అరగంట వరకూ ఎవ్వరూ రారు' అంది.

'నీ వుత్తరం అందింది.' ఎలా మొదలుపెట్టాలో తెలీక తికమకపడ్తూ అన్నాడు.

'మరి ఇక్కడిదాకా వచ్చావేం? దస్తూరి అర్థం కాలేదా?' సూటిగా అడిగింది.

ప్రభాకరానికి షాక్ తిన్నట్లయింది. ఎన్నో చెప్పాలనుకొని వచ్చాడు. కాని యిప్పుడలా చెప్పే స్థితిలో లేడు.

మెల్లగా తేరుకుని 'అవును నిజమే; ఐతే అర్థంకానిది నీ దస్తూరిమాత్రం కాదు,' అన్నాడు.

'మరి?' ఎటో చూస్తూ అడిగింది.

'మసగ్గా కన్పిస్తూన్న నీ మనసు.' కాస్త కోపంగా అన్నాడు.

సమాధానంగా భావం లేని నవ్వొకటి నవ్వేసింది ప్రేమ. ఆ నవ్వు ప్రభాకరం మనసుగుండా దూసుకుపోయినట్లయింది. ఆడదానికి హృదయం లేదంటూ ఓ గేయంలో చదివాడు ఇదివరకోసారి. 'పనిలేని వాళ్ళంతా యిలాగే రాస్తుంటారు' అనుకున్నాడు అప్పుడు.

కాని ఇప్పుడు తెలిసింది. నిజంగా ఆడాళ్ళకి హృదయాలుండవు. ఎంతో ఆశతో తన మనసు తెరిచి ఆమె ముందు పరిచాడు. ఫలితం ప్రత్యక్షంగా చూస్తున్నాడు. తన ఆశయాన్ని చెల్లాచెదరుచేసి, హృదయాన్ని ముక్కలుగా చేసి చూసి ఆనందిస్తూంది.

ప్రభాకరానికి కోపం పెరిగిపోయింది. గభాల్న లేచి మరేమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ప్రేమ చేతుల్లో ముఖం దాచుకొని ఏడ్చేసిన సంగతిమాత్రం చూళ్ళేదు ప్రభాకరం.

× × ×

మర్నాడు ప్రభాకరానికో ఉత్తరం వచ్చింది. కవర్ మీది దస్తూరి చూశాడు. ప్రేమ దగ్గర్నుంచే వచ్చింది. చింపేద్దామనుకున్నాడు కాని, ఎందుకో అలాచేయలేకపోయాడు. మడిచి జేబులో పెట్టేశాడు.

ఆ సాయంత్రం ఆఫీసునుండి రాగానే ఉత్తరం సంగతి జ్ఞాపకమొచ్చింది. అందులో ఏముంటుందో తనకు తెలుసు. మళ్ళీ నాలుగు నీతివాక్యాలు వల్లించివుంటుంది. అంతే.

అయిష్టంగానే తెరిచి చదవడం మొదలుపెట్టాడు.

'ప్రభాకరం !—

నా ప్రవర్తన నిన్ను చాల కష్టపెట్టి వుంటుంది. క్షమించు. మొదట నేచెప్పేది పూర్తిగా విను. ఆ తర్వాత నీ యిష్టమొచ్చినట్లే చేయి.

ముందునుండి ఆశల నేవి పెంచుకోవడం నాకలవాటు లేదు. కారణం మా ప్రసాదం అన్నయ్య సంగతే! మా ప్రసాదం పెద్ద ఆఫీసరవుతాడనీ, కార్లు, మేడలూ కొనేస్తాడని చిన్నప్పటినుండి అనుకునేదాన్ని. కాని విధి ఎంతచిత్రంగా మారుతుందో అనుభవంమీదగాని తెల్సుకోలేకపోయాను.

నేను నీకంటె వయసులో పెద్దదాన్ని. మన పెద్దలెవరూ మన పెళ్ళికి వప్పుకోరు. వప్పుకున్నా వప్పుకోకపోయినా సాధించుకునే ధైర్యం నీకుండొచ్చు. కాని ఒకవేపు మనోవ్యథతో క్రుంగిపోతున్న మా నాన్నను యీ దశలో ఎదిరించి బాధించే ఆత్మ... ...కు లేదు. అలాగని నన్ను అ...

మైపోతావో అని భయంగానే వుంది మరోవేపు.

ప్రభాకరం! నన్నర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. లోకం గొడ్డుపోలేదు. నా తలదన్నే వాళ్ళెందరో వున్నారు. ఈడూ జోడూ చూసుకుని, చక్కగా పెళ్ళి చేసుకొని నువ్వయినా సుఖపడు. నన్ను గురించి మనసు పాడు చేసుకోకు.

అసలు నీ విక్కడవున్న ఆ పదిరోజులూ మునుపటిలాగే నీతో మాట్లాడక పోయినా బాగుండేది కదూ! ఎందుకనో అలా చేయలేకపోయాను. చనువిచ్చాను. అదే పెరిగి ఇప్పుడింత మనఃక్షోభను తెచ్చిపెట్టింది. ఇకనైనా మనసు మరోవేపు మళ్ళించుకుని నిశ్చింతగా వుండు.

నేనెప్పుడూ నువ్ సుఖపడాలనే కోరుకుంటాను
దయచేసి యిక ఎలాంటి ఉత్తరాలూ వ్రాయకు.

శుభాకాంక్షలతో

ప్రేమ.'

చదవటం ముగించాడు ప్రభాకరం, కళ్లల్లో నీళ్ళు నిండాయి. మరుక్షణంలో పొర్లి చేతిమీద టపటపా పడ్డాయి వెచ్చగా. ప్రభాకరానికది చాలలేదు. మనస్సంతా కడిగేసేట్లు గట్టిగ ఏడ్చేయాలనిపించింది.

ప్రేమ ఎంత మంచిది! నిజాన్ని ఎంత చక్కగా చెప్పింది. తాను సరిగా అర్థం చేసుకోలేక ఏదేదో అనుకొన్నాడు. అవును—తన నాల్రోజులు పరిచయంకోసం కని పెంచినవాళ్లనెలా ఎదిరిస్తుంది? ఎందుకు ఎదిరించాలి?

ఇప్పుడు ప్రేమమీద తనకున్న అభిమానం మరింత పెరిగిపోయింది. ఇంత మంచి హృదయాన్ని పొందటం నిజంగా అదృష్టమే. ప్రేమ తనకు కావాలి. ఎలాగైనా తనదిగా చేసుకోవాలి. లేకుంటే బ్రతకలేడు; బ్రతకడు కూడా.

ఓ పని చేస్తేనో! ఏదోవిధంగా మామయ్యను ఒప్పిస్తేనో. అప్పుడు ఎవరి మనసూ నొప్పించనక్కరలేదు. అందుకే 'పరిస్థితుల్ని మన కనుకూలంగా మార్చుకోవాలి మనం పరిస్థితుల వెంట పోకూడదు' అన్నాడు ఓమహాను గుండెమీద చెయ్యివేసుకుని గట్టిగా, తృప్తిగా ఓ సారి నిట్టూర్చాడు.

మరుసటిరోజు ప్రేమను కలిసి తన అభిప్రాయాన్ని చెప్పేశాడు. అన్నీ చెప్పాక 'ఏం భయపడకు. బాధపడకు. పెద్దల అంగీకారంతో అన్నీ జరుగుతాయి.' అన్నాడు.

\+ + +

రోజులు గడిచాయి. ప్రేమకు పెళ్ళయింది. పెద్దలందరి ఆశీర్వాదాలతోనే జరిగింది.

ఐతే—ప్రభాకరం మాత్రం కాదు.

ప్రభాకరం వుద్యోగానికి రాజీనామా యిచ్చాడు.

ఆ తర్వాత అతనిజాడ ఎవ్వరికీ తెలీదు.

ప్రేమ మనసులో వున్న అగ్నిపర్వతం సంగతికూడా ఎవ్వరికీ తెలీదు.



M/S
P. B. No